సాక్షి ఆదిలాబాద్

బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



ఏసీబీకి చిక్కిన అధికారులు

జిల్లా కేంద్రంలోని ఎంప్లాయిమెంట్ శాఖ అధికారులతో పాటు రిమ్స్ జూనియర్ అసిస్టెంట్ ఏసీబీకి చిక్కారు. రూ.2.25లక్షలు తీసుకుంటుండగా పట్టుబడ్డారు. 10లో▸



లాభాల సాగు...బ్రొకోలీ

జిల్లాలోని పలువురు రైతులు బ్రొకోలీ సాగుపై దృష్టి సారించారు. మూడేళ్లుగా మంచి లాభాలు గడిస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/18.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి వేళ లో చలి తీవ్రతతో పాటు గాలిలో తేమశాతం కొంతమేర తగ్గనుంది.

న్యూస్‌రీల్

పుర ప్రజావాణికి స్పందన



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ శైలజ

కైలాస్‌నగర్: పట్టణ పరిధిలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన పుర ప్రజావాణికి స్పందన లభించింది. తమ సమస్యలను నివేదించేందుకు పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన పలువురు తరలివచ్చారు. బాధితుల సమర్పించిన అర్జీలను మున్సిపల్ కమిషనర్ శైలజ స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ వారం మొత్తం 47అర్జీలు అందాయి. ఇందులో అత్యధికంగా టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి 19, రెవెన్యూ 19, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి తొమ్మిది ఉన్నాయి. వీటిని ఆయా విభాగాల అధికారులకు అందజేస్తూ పరిష్కరించాలని ఆదేశించారు. కాగా గత వారం అందిన 29 అర్జీలను పరిష్కరించినట్లుగా కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ దివాకర్, డీఈలు తిరుపతి, యూనస్, ఆర్‌వో జాదవ్ కృష్ణ, టీపీవో అనురాధ, ఎస్సై నరేందర్, కంప్యూటర్ ఇన్‌చార్జి రవీందర్, పెంటాజీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ‘ఆపరేషన్ స్మైల్’

కైలాస్‌నగర్: ఆపరేషన్ స్మైల్ తొమ్మిదో విడత ముగింపు కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని బాలరక్షక్ భవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ విడతలో 106 మంది పిల్లలను గుర్తించడంతోపాటు పాటు కొంతమందిని తల్లిదండ్రులకు అప్పగించగా, మరికొంతమందిని పాఠశాలల్లో చేర్పించారు. ఇతర రాష్ట్రాల పిల్లలను ఆయా రాష్ట్రాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో పనిచేసిన వారందరికి అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు చేతుల మీదుగా ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీసీపీవో రాజేంద్రప్రసాద్, కార్మికశాఖ అధికారులు వినోద్, రాజలింగు, సీడబ్ల్యూసీ సభ్యులు సమీరుల్లా ఖాన్, డేవిడ్, దశరథ్, చైల్డ్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి, మహిత కోఆర్డినేటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

3న సర్టిఫికెట్ల పరిశీలన

ఆదిలాబాద్‌టౌన్: డైట్ కళాశాలల్లో ప్రవేశం కోసం ఈనెల 3న సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి ప్రకటనలో తెలిపారు. మొదటి, రెండో విడతల్లో సర్టిఫికెట్ల పరిశీలన చేసుకోని అభ్యర్థులు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డైట్ కళాశాలలో హాజరుకావాలని సూచించారు. 6 నుంచి 9 వరకు వెబ్‌ఆప్షన్లు ఇచ్చుకోవాలని, 14న సీట్ అలాట్‌మెంట్, 21న కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

మైనార్టీ గురుకుల పాఠశాల తనిఖీ



తనిఖీ చేస్తున్న కిరణ్‌కుమార్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలను జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి కిరణ్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. భోజన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఆయన వెంట ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్: ఉమ్మడి జిల్లాకు చెందిన ఎస్టీ యువతకు నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో యువజన సర్వీసుల శాఖ, సెట్విన్, ఐటీడీఏల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ అందజేయనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు ప్రకటనలో పేర్కొన్నారు. కంప్యూటర్, ఫ్యాషన్ డిజైనింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్, సీసీ కెమెరా ఇన్‌స్టలేషన్, రిపేరింగ్, ఏసీ మెకానిజం కోర్సుల్లో శిక్షణ ఉంటుందని తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమీపంలో గల యువజన శిక్షణ కేంద్రం (వైటీసీ)లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన వారు ఫిబ్రవరి 10లోగా వైటీసీ కేంద్రంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం ఐదు గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు భోజనం, వసతి సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 96666 91187, 77026 09161 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కొత్త కలెక్టర్.. రాహుల్‌రాజ్



రాహుల్ రాజ్

- ‘కుమురంభీం’ నుంచి జిల్లాకు రాక
- సిక్తా పట్నాయక్ హనుమకొండకు బదిలీ
- నిర్మల్ కలెక్టర్‌గా ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కొత్త కలెక్టర్‌గా రాహుల్‌రాజ్ నియామకమయ్యారు. ప్రస్తుత కలెక్టర్ సిక్తా పట్నాయక్ హనుమకొండ కలెక్టర్‌గా బదిలీపై వెళ్లనున్నారు. అలాగే ఉట్నూర్ ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డిని నిర్మల్ కలెక్టర్‌గా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాహుల్‌రాజ్ జిల్లా కలెక్టర్‌గా రానున్నట్లు కొద్ది రోజులుగా ఇక్కడి ప్రజల్లో జరుగుతున్న చర్చ నిజమైంది. కుమురంభీం ఆసిఫాబాద్ కలెక్టర్‌గా పనిచేస్తున్న రాహుల్‌రాజ్‌ను ఆదిలాబాద్ కలెక్టర్‌గా నియమించారు. గతేడాది కలెక్టర్ సిక్తా పట్నాయక్ ప్రసూతి సెలవులకు వెళ్లిన సందర్భంలో ఈయన నెల పాటు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్‌గా పనిచేశారు. ఆయనే జిల్లా కలెక్టర్‌గా రానుండటంతో తన పనితీరుతో ఎలాంటి ముద్ర వేస్తారనే చర్చ సాగుతోంది. ఆయన గురువారం జిల్లాలో కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నట్లుగా అధికారిక వర్గాల సమాచారం.

పేరు:	రాహుల్‌రాజ్
ఐఏఎస్ బ్యాచ్ :	2015
స్వస్థలం :	హైదరాబాద్
తొలి పోస్టింగ్:	బెల్లంపల్లి సబ్ కలెక్టర్ జీహెచ్ఎంసీ కమిషనర్‌గా సేవలు
కలెక్టర్‌గా..:	ఆసిఫాబాద్ తొలి పోస్టింగ్
భార్య పేరు:	శ్రీజ (బ్యాంక్ ఉద్యోగి) ఇద్దరు పిల్లలు

సిక్తా పట్నాయక్.. రెండున్నరేళ్లు



బదిలీపై వెళ్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

పెద్దపల్లి కలెక్టర్‌గా పనిచేస్తూ 2020 జూలై 17న ఆదిలాబాద్ కలెక్టర్‌గా సిక్తా పట్నాయక్ శ్రీదేవసేన నుంచి బాధ్యతలు స్వీకరించారు. రెండు సంవత్సరాల ఆరు నెలల పాటు కలెక్టర్‌గా సేవలందించిన ఆమె ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు తొలి ప్రాధాన్యతనిచ్చారు. కోవిడ్ రెండో దశ తీవ్రరూపం దాల్చుతున్న తరుణంలో జిల్లాలో వైరస్ కట్టడికి ప్రత్యేక శ్రద్ధ వహించారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడంతో పాటు వైరస్ కారణంగా పాలనకు ఇబ్బంది కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ ఆఫీస్ అమలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన దళితబంధు అమలుపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఎక్కువమంది ఎస్సీలకు భూపంపిణీ చేపట్టి జిల్లాను రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిపారు. ప్రభుత్వ పథకాల అమలులో జిల్లాను ముందుంచేలా అధికారులకు మార్గనిర్దేశం చేస్తూ వాటి ఫలితాలను రాబట్టేందుకు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించారు. క్షేత్రస్థాయి పర్యటనలు సైతం చేపట్టి వారిని ప్రోత్సహించారు. ముఖ్యంగా 2021లో కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలు, ఆదివాసీగూడేలు, తండాలను కాలినడకన వాగులు, వంకలు దాటుకుంటూ వెళ్లి పరిశీలించారు. వారితో మమేకమై సమస్యలు తెలుసుకోవడంతో పాటు వారికి అండగా నిలిచారు. బాధితులకు అవసరమైన సహాయ సహకారాలను అందించారు. ప్రజాప్రతినిధులు, అధికారులనే తారతమ్యం లేకుండా ప్రభుత్వ కార్యక్రమాల్లో అందరినీ భాగస్వాములను చేసి విజయవంతం చేశారు. వజ్రోత్సవాలను జిల్లాలో ఘనంగా నిర్వహించి రాష్ట్రంలోనే మంచి పేరు తెచ్చుకున్నారు.

ఐటీడీఏ పీవో బదిలీ

- నిర్మల్ కలెక్టర్‌గా వరుణ్‌రెడ్డి
- కొత్త పీవోగా ఎవరో..?



నిర్మల్ కలెక్టర్‌గా బదిలీ అయిన వరుణ్‌రెడ్డి

ఉట్నూర్: ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వరుణ్‌రెడ్డిని నిర్మల్ కలెక్టర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే పీవోగా ఇంకా ఎవరికి పోస్టింగ్ ఇవ్వకపోవడంతో కొత్తగా ఎవరు వస్తారో అనే ఉత్కంఠ నెలకొంది. గతంలో కుమురంభీం ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించిన కర్నాటి వరుణ్‌రెడ్డిని గతేడాది జూన్ 13న ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా ప్రభుత్వం నియమించింది. పీవోగా ఏడు నెలల 18 రోజుల పాటు బాధ్యతలు నిర్వహించిన వరుణ్‌రెడ్డి గిరిజనాభివృద్ధిలో తనదైన ముద్ర వేశారు. వివాదరహితుడిగా పేరుపొందిన ఈయన ఆదివాసీ, గిరిజన గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి స్థానికులతో మమేకమయ్యారు. ఏజెన్సీ గ్రామాల్లో గిరి పోషణ్ కార్యక్రమం అమలుపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆశ్రమ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ‘మిషన్ లక్ష్యం’ పేరుతో వంద రోజుల ప్రణాళిక అమలు చేశారు. అలాగే మూడు నుంచి తొమ్మిదో తరగతి వరకు గిరిజన విద్యార్థులు చదవడం, రాయడంతో పాటు కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించేలా వంద రోజుల ప్రణాళికలో భాగంగా అక్షరజ్యోతి కార్యక్రమం అమలు చేశారు. ఇటీవల ప్రభుత్వం సర్కారు కొలువుల భర్తీకి చర్యలు చేపట్టడంతో ఉట్నూర్, ఇచ్చోడ, బెల్లంపల్లి ప్రాంతాల్లోని వైటీసీ కేంద్రాల ద్వారా నిరుద్యోగ గిరిజన యువతకు ప్రత్యేకంగా ఉచిత శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పీటీజీ గిరిజన నిరుద్యోగ యువతపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆదివాసీ గిరిజనులకు తక్కువ ఖర్చుతో గృహ నిర్మాణాల కోసం చర్యలు చేపట్టారు.

దృష్టిలోపం నివారణకు ‘కంటి వెలుగు’

- జిల్లా జడ్జి ఎంఆర్ సునీత



కంటి పరీక్షలు చేయించుకుంటున్న జిల్లా జడ్జి

ఆదిలాబాద్‌టౌన్: దృష్టి లోపం నివారణకు కంటి వెలుగు దోహదపడుతుందని జిల్లా జడ్జి ఎంఆర్ సునీత అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో మంగళవారం ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారంతా కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆమెతో పాటు జడ్జీలు మాదవీకృష్ణ, ఎం.సతీశ్‌కుమార్, ప్రమీల జైన్, మంజుల సూర్యవార్, డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమాదేశ్ పాండే, ఇతర సిబ్బంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి రీడింగ్ గ్లాసులు తక్షణమే అందించినట్లు డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ తెలిపారు. కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్, పీపీ ముస్కు రమణారెడ్డి, జిల్లా కోర్టు ఏఓ సూర్యకాంత్, పర్యవేక్షకులు మోహన్, న్యాయవాదులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని నాందేడ్‌లో జరిగే బీఆర్ఎస్ మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మంగళవారం మహారాష్ట్రలోని చిన్నఅర్లి గ్రామాన్ని సందర్శించారు. స్థానిక నాయకులు, ప్రజలతో చర్చించారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మిషన్ భగీరథ, షాదీముబారక్, కల్యాణలక్ష్మి, ఉచిత విద్యుత్ పథకాల గురించి వివరించారు. ఎమ్మెల్యే వెంట డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మెట్టు ప్రహ్లాద్, తదితరులు పాల్గొన్నారు.

బడుల ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

- కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఆదిలాబాద్‌టౌన్: మన ఊరు–మన బడి, మన బస్తి–మన బడి కార్యక్రమం కింద పనులు పూర్తయిన పాఠశాలల ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యానగర్, హమీద్‌పుర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను మంగళవారం సందర్శించి డీఈవో ప్రణీతను ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో తరగతి గదులు, మరుగుదొడ్లు, తదితర పనులను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని మూడు మోడల్ పాఠశాలలను బుధవారం ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి డ్యూయల్ డెస్క్, గ్రీన్‌బోర్డ్, ఫ్యాన్ తదితర ఏర్పాట్లపై ఆరా తీశారు. విద్యాబోధన తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మన ఊరు–మన బడి కింద పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ ప్రభుత్వం సూచించినట్లు సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట ఎంఈవో జయశీల, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

జీవో నంబర్ 3ను అమలు చేయాలని వినతి

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయులకు అన్యాయం జరగకుండా జీవో నంబర్ 3ను అమలు చేయాలని టీఎస్ టీటీఎఫ్ నాయకులు కోరారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు డీఈవో ప్రణీతను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బదిలీ, పదోన్నతుల్లో ఉపాధ్యాయులకు మేలు జరిగేలా చూడాలని కోరారు. ఇందులో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, నరేశ్, రవీందర్, విలాస్, శేఖర్, గోవింద్, మదన్ తదితరులున్నారు.

‘ఓపెన్’ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఆదిలాబాద్‌టౌన్: ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్ష ఫీజు ఈనెల 10లోగా చెల్లించాలని డీఈవో ప్రణీత, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ అశోక్ ప్రకటనలో తెలిపారు. మీసేవలో, టీఎస్ఆన్‌లైన్, ఏపీ ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చని పేర్కొన్నారు. రూ.25 అపరాద రుసుముతో ఈనెల 11 నుంచి 16 వరకు, రూ.50 అపరాద రుసుముతో 17 నుంచి 22వరకు చెల్లించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

రోడ్డెక్కిన రైతులు



హస్నాపూర్ అంతర్రాష్ట్ర రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

- అప్రకటిత విద్యుత్ కోతలపై నిరసన
- హస్నాపూర్‌లో రాస్తారోకో

తాంసి: అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతులు రోడ్డెక్కారు. సాగు నీరందక పంట పొలాలు ఎండిపోతున్నాయంటూ ఆందోళనకు దిగారు. మండలంలోని హస్నాపూర్ సమీపంలోని అంతర్రాష్ట్ర రహదారిపై మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం సాగుకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తానని ప్రకటించడంతో తామంతా బోర్ల కింద పంటలను సాగు చేసుకుంటున్నామని తెలిపారు. అయితే ప్రస్తుతం ఐదు నుంచి ఆరు గంటలు కూడా సరఫరా కావడం లేదన్నారు. దీంతో సాగు నీరందక పంటలు కళ్లెదుటే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి 24గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ అధికారులు వచ్చి సమాధానం చెప్పే వరకూ కదిలేది లేదని స్పష్టం చేశారు. సుమారు గంటకు పైగా రైతులు ఆందోళన చేపట్టడంతో రహదారికి ఇరువైపులా వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ఎస్సై ధనశ్రీ అక్కడికి చేరుకున్నారు. రైతులతో మాట్లాడి ఆందోళన విరమించాలని కోరగా వారు వినిపించుకోలేదు. విద్యుత్‌శాఖ డీఈ హరికృష్ణ, ఏఈ మనోజ్ కుమార్ వచ్చి రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఇందులో రైతులు తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, స్వామి, రాజీవ్, మహేందర్, చందర్ తదితరులున్నారు.



రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

స్పౌజ్ ‘ఆసరా’కు ఓకే

- దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు
- మిగతావి మాత్రం పెండింగ్‌లో..
- మంజూరైన ‘57’ఏళ్ల వాటిలో కొన్ని రద్దు
- అర్హులకు తప్పని నిరీక్షణ



కైలాస్‌నగర్: ఆసరా పథకం కింద అందించే పింఛన్‌ను గతేడాది ఆగస్టు నుంచి నిలిపివేసిన రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల స్పౌజ్ కేటగిరీలో మంజూరుకు మాత్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పింఛన్ తీసుకుంటూ భర్త మరణిస్తే భార్యకు, భార్య మరణిస్తే భర్తకు తిరిగి మంజూరు చేయాలని తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. డీఆర్డీవో కార్యాలయానికి చేరిన ఉత్తర్వులను ఆ శాఖ అధికారులు జిల్లాలోని ఎంపీడీవోలకు పంపించారు. దీంతో వారు తమ పరిధిలోని అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఎంపీడీవోలు వాటిని ఎప్పటికప్పుడు డీఆర్డీవో కార్యాలయానికి పంపుతున్నారు.

జిల్లాలో 164 మంది దరఖాస్తు

జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 164 మంది స్పౌజ్ కేటగిరీలో దరఖాస్తు చేసుకున్నారు. అర్హులైన వారు తమ ఆధార్, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్, ఇది వరకు పింఛన్ పొందుతూ మరణించిన వారి డెత్ సర్టిఫికెట్‌తో సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇలా అందిన దరఖాస్తులను ఎంపీడీవోలు మంజూరు కోసం డీఆర్డీవో కార్యాలయానికి పంపిస్తున్నారు. వీటికి సంబంధించిన కొత్త పింఛన్లు వారంలోనే మంజూరవుతాయని అధికారులు చెబుతున్నారు.

1600 మంది పింఛన్ రద్దు

జిల్లాలో దారిద్ర్యరేఖకు దిగువన గల 57 ఏళ్లు నిండిన వారందరికీ పింఛన్ మంజూరు చేస్తామని 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం వాటిని మూడేళ్ల అనంతరం గతేడాది ఆగస్టులో మంజూరు చేసింది. జిల్లా వ్యాప్తంగా 8,972 మందికి కొత్త పింఛన్ మంజూరైంది. అయితే ఇందులో 1600 మందిని అనర్హులుగా గుర్తిస్తూ తిరిగి రద్దు చేసింది. అలాగే కొత్త దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియనూ నిలిపివేసింది. దీంతో అర్హులై ఉండి పింఛన్ అందని వారు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. తమకు పెన్షన్ అందించాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతూ వేడుకుంటున్నా ప్రయోజనం లేకుండా పోయింది.

164 మందికి ప్రొసీడింగ్‌లు జారీ..

స్పౌజ్ కేటగిరీలో ఆసరా పింఛన్ల మంజూరుకు ప్రభుత్వం ఇటీవల అనుమతినిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వాటి ప్రకారం ఎంపీడీవోల ద్వారా అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. ఇప్పటివరకు జిల్లాలో 164 మంది దరఖాస్తు చేసుకోగా వాటికి మంజూరు చేస్తూ ప్రొసీడింగ్‌లను జారీ చేశాం. ఇంకా ఎవరైనా అర్హులైన ఉంటే సంబంధిత ఎంపీడీవో కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలి. భూమి ఎక్కువగా ఉండటం, గవర్నమెంట్ ఎంప్లాయి ఉండటం వంటి కారణాలతో కొన్ని పెన్షన్లు రద్దయ్యాయి. ప్రభుత్వమే రద్దు చేసింది కనుక వాటికి మేమేమి చేయలేం.

– శేష్‌రావు, ఏపీడీ

కళ్లకు గంతలతో నిరసన



నిరసన తెలుపుతున్న స్టాఫ్ నర్సులు

ఆదిలాబాద్‌టౌన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రిమ్స్‌లో పనిచేస్తున్న 300 ఓసీఎస్ స్టాఫ్ నర్సులు చేపడుతున్న సమ్మె కొనసాగుతోంది. ఇందులో భాగంగా మంగళవారం వారు కళ్లకు గంతలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిది నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్య పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అశన్న, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, స్టాఫ్‌నర్సులు రాజ్యలక్ష్మి, కమల, మీనాక్షి, సురేఖ, కృష్ణమూర్తి, అరుణ, పెర్సి, విశాల తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బావిలో పడి వివాహిత మృతి


సాబ్లే పద్మ (ఫైల్)

ఇంద్రవెల్లి: బావిలో పడి వివాహిత మృతి చెందిన సంఘటన మంగళవారం మండలంలోని అందు నాయక్‌తాండ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ఎస్సై సునీల్ వివరాల ప్రకారం... అందునాయక్‌తాండ గ్రామానికి చెందిన సాబ్లే పద్మ(30) భర్తతో కలిసి వ్యవసాయ పనులు చేస్తుండేది. అయితే పద్మ కొన్నిరోజులుగా మతిస్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతోంది. మంగళవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిన పద్మ వ్యవసాయ చేనులోని బావిలో ప్రమాదవశాత్తు పడి మృతి చెందింది. స్థానికులు గమనించి కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతురాలి తల్లి కమలబాయి ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పద్మకు భర్త పరమేశ్వర్, ఇద్దరు కుమారులు శాసంక్(6), సందీప్(4) ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సునీల్ తెలిపారు.

అనారోగ్యంతో కళాకారుడు మృతి


మహిళా వేషధారణలో నారాయణ (ఫైల్)

తానూరు: మండలంలోని భోసి గ్రామానికి చెందిన కళాకారుడు కన కాపూర్ నారాయణ మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. నారాయణ తెలంగాణ ఉద్యమంలో తన పాటలు, నటన, నృత్యాలతో ప్రజల దృష్టిని ఉద్యమం వైపు మళ్లించారు. ధూంధాం కార్యక్రమాల్లో పాల్గొని మహిళా వేషధారణలో అలరించారు. గ్రామంలో నిర్వహించిన అమరణ నిరాహార దీక్షా శిబిరం నిర్వహించి కార్యక్రమాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్థానిక శిశుమందిర్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహించారు. ఆయన మృతిపై శిశుమందిర్ పాఠశాల విద్యార్థులు, గ్రామస్తులు సంతాపం ప్రకటించారు.

లైంగికదాడి కేసులో ఒకరికి పదేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం చేసిన వ్యక్తికి పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానా విధిస్తూ పోక్సో కోర్టు జడ్జి మాధవికృష్ణ తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి ఎం.పండరి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. 2017 డిసెంబర్ 1న బేల మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక తన స్నేహితుల వద్దకు వెళ్తుంటే హస్నాపూర్ గ్రామానికి చెందిన ప్రేమ్‌దాస్ కిడ్నాప్ చేసి మహారాష్ట్రలోని పూణెకు తీసుకెళ్లాడు. అక్కడ అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి కుటుంబీకులు గాలించి ఆమెను ఇంటికి తీసుకొచ్చారు. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై నరేష్‌కుమార్ కేసు నమోదు చేశారు. పీపీ రమణారెడ్డి 13మంది సాక్షులను విచారించి నేరం రుజువు చేయడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు.

లాభాల సాగు...బ్రోకోలి


ఇచ్చోడ మండలంలోని దాబాకె గ్రామంలో సాగవుతున్న బ్రోకోలి

- అర ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి
- లాభాలు వస్తున్నాయంటున్న రైతులు

ఇచ్చోడ: అన్నదాతలు లాభాల వచ్చే కూరగాయల సాగుపై మక్కువ చూపుతున్నారు. బ్రోకోలి సాగుతో లాభాలు గడిస్తున్నారు జిల్లాలోని రైతులు. మూడేళ్ల కిందట జిల్లాలో కొంత మంది రైతులు బ్రోకోలి పంటల సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. పట్టణ ప్రాంతాలకు సమీపంలో కూరగాయలు సాగుచేసే రైతులు బ్రోకోలిని ఎక్కువగా సాగు చేస్తుంటారు. ఈ పంటలో అనేక ఔషధ గుణాలు సైతం అధికంగా ఉన్నాయి. దీనికి ధర సైతం ఎక్కువగానే ఉంటుంది. దీనికి కిలో బ్రోకోలికి రూ.70 నుంచి 80 పలుకుతుంది. మూడేళ్ల కిందట ఈ పంటను జిల్లాలోని పాన్నారి, అంకోలి, బేల తదితర ప్రాంతాల్లో సాగుచేశారు. ఈ ఏడాది ఇచ్చోడ మండలంలోని దాబాకె గ్రామంలో రాథోడ్ గణేశ్ అనే రైతు పాలీహౌస్‌లో అర ఎకరంలో సాగు చేశాడు.

ఔషధ గుణాలు బాగు...

చూడడానికి కాలీఫ్లవర్ లాగా కనిపించే పువ్వు జాతి కూరల్లో బ్రోకోలి ఒకటి. అత్యంత ఆరోగ్యవంతమై కూరగాయల్లో దీనికి అధిక ప్రాధాన్యం ఉంది. అనేక పోషక విలువలతో పాటు విటమిన్ బీ, సీ, ఈలు కలిగి ఉండి యాంటీ ఆక్సిడెంట్స్ గుణాలు పుష్కలంగా ఉన్నాయి. బ్రోకోలి బ్లడ్‌లోని షుగర్‌ను క్రమబద్ధీకరించే గుణాలు కూడా అధికంగా ఉంటాయని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు.

విత్తనం ధర కూడా ఎక్కువే...

బ్రోకోలి విత్తన ధర ఎక్కువే. బ్రోకోలి పది గ్రాముల విత్తన ప్యాకెట్‌లో మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. దీని పది గ్రాముల విత్తనం ప్యాకెట్ ధర రూ.650 వరకు పలుకుతోంది. అర ఎకరంలో బ్రోకోలి సాగుకు కనీసం 15 నుంచి 18 ప్యాకెట్లు అవసరమని, ఎకరం విత్తనాలకు రూ.10వేల నుంచి 12 వరకు, మూడు నెలల పాటు సాగుకు అయ్యే ఖర్చు మరో రూ.15వేల వరకు మొత్తం దాదాపుగా రూ.30వేల వరకు ఖర్చు అవుతున్నట్లు సాగు చేస్తున్న రైతులు చెబుతున్నారు.

లాభాలు వచ్చాయి...



అర ఎకరంలో బ్రోకోలిని సాగు చేశాను. 20నుంచి 25క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చింది. రూ.5వేలకు క్వింటాల్ చొప్పున హైదరాబాద్‌లో విక్రయించాను. పంటపై పెట్టిన ఖర్చులు పోను దాదాపుగా రూ.లక్ష వరకు లాభం వచ్చింది.

– రాథోడ్ గణేష్, దాబా(కె) బ్రోకోలి సాగుచేస్తున్న రైతు

సాగుతో మేలు...



గతంలో జిల్లాలో కొంత మంది రైతులు బ్రోకోలి పంటను సాగు చేశారు. ఈ పంటలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నప్పటికీ ఇక్కడి మార్కెట్లో బ్రోకోలికి ఆశించిన స్థాయిలో ధరలు రాక పోవడంతో రైతులు సాగుకు ముందుకు రావడం లేదు. సాగు చేసిన పంటలను పట్టణ ప్రాంతాల్లో విక్రయించి లాభాలు పొందవచ్చు.

– మహేశ్, ఉద్యానవనశాఖ అధికారి

క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి


నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

- ఘనంగా కళాశాల వార్షికోత్సవం
- ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు


మాట్లాడుతున్న డీఐఈఓ రవీంద్ర కుమార్

నేరడిగొండ: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని డీఐఈవో రవీంద్రకుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, స్పోర్ట్స్ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో రాణించి తల్లిదండ్రులు, గురువుల పేరును నిలబెట్టాలని సూచించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు మైమరిపించాయి. విద్యార్థులు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కేరింతలతో కళాశాల ఆవరణం దద్దరిల్లిపోయింది. అలాగే కళాశాలలో సొంత ఖర్చుతో మధ్యాహ్న భోజనం కొనసాగిస్తున్న లెక్చరర్ బలరాం జాదవ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జాదవ్ గణేష్, సుదర్శన్, బోథ్, నేరడిగొండ కళాశాలల ప్రిన్సిపాళ్లు, శంకర్, శబాన తరన్నం, లెక్చరర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ

కోటపల్లి: మండలంలోని పిన్నారం గ్రామంలో వచ్చే నెల 2నుంచి రాష్ట్రస్థాయి ఓపెన్ టు ఆల్ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అంబాల రాజేశ్, హనుమంతరావు ఓ ప్రకటనలో తెలిపారు.ఈటోర్నమెంట్‌లో క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. వివరాలకు 9347319628 నంబర్‌లో సంప్రదించాలని, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని రాష్ట్రస్థాయి వాలీ బాల్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు.

ఏజెన్సీలో బెల్ట్‌షాపులు తొలగించాలి

- ఐటీడీఏ పీవోకు వినతి


పీవోకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి విద్యకు దూరం అవుతున్నారని, ఏజెన్సీలోని బెల్ట్ షాపులను తొలగించాలని మంగళవారం రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెందోర్ ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చదువుకునే సమయంలో మద్యం మత్తులో యువత చెడు అలవాట్లకు గురై రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారని, తల్లిదండ్రులను బాధ్యతగా చూసుకునే సమయంలో మద్యానికి బానిసలవుతున్నారన్నారు. దీంతో తల్లిదండ్రులకు ఎనలేని దుఃఖాన్ని కలిగిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువత ఏజెన్సీ ప్రాంత మనుగడ యువతపై ఆధారపడి ఉందని ఉమ్మడి జిల్లాలో ఏజెన్సీలోని బెల్టు షాపులను తొలగించాలని డిమాండ్ చేశారు.

రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శంకర్

బేల: కోర్ట చనకా రిజర్వాయర్ భూసేకరణలో రైతులకు అన్యాయం చేసినా, బెదిరించినా ఊరుకోమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2016లో రూ.350కోట్ల నిర్మాణ వ్యయంతో ప్రారంభమైన కోర్ట చనకా బ్యారేజీ ప్రస్తుతం రూ.750 కోట్లకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెంచిందన్నారు. కమీషన్ల కోసం కక్కుర్తిపడి కాంట్రాక్టర్లతో కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. 2016లో ఎకరాకు రూ.10లక్షల చొప్పున నష్ట పరిహారం ఇచ్చి రైతుల భూములు తీసుకున్నారని తెలిపారు. కానీ ప్రస్తుతం ఎనిమిదేళ్ల తర్వాత ఈ బ్యారేజీ ప్రధాన కాల్వకు అనుసంధానంగా నిర్మించనున్న డిస్ట్రిబ్యూషన్ కాలువ భూసేకరణ కోసం రూ.6లక్షలు, రూ.7లక్షల చొప్పున ఇస్తామనడం ఏమిటని మండిపడ్డారు. ఇచ్చేంది తీసుకోవాలని, లేదంటే భూములు బలవంతంగా లాక్కుంటామని అధికారులు బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ బెదిరించడం వెనుక బీఆర్‌ఎస్ కమీషన్ల నాయకులు ఉన్నట్లు తెలుస్తుందన్నారు. సమావేశంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, సర్పంచ్ రాకేష్, నాయకులు తాక్రే మురళీధర్, బోనిగిరివార్ గణేష్, పోత్రాజ్ నవీన్, బర్కాడే రాము, ధర్నే జీవన్ పాల్గొన్నారు.

కత్తితో హల్‌చల్


తుకారాంను పట్టుకున్న పోలీసులు

బోథ్: మండల పరిషత్ బాలికల పాఠశాలలో ఓ వ్యక్తి మధ్యాహ్న బిల్లుల కోసం కత్తితో హల్‌చల్ చేశాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తుకారం కుమారుడు సుభాష్ మధ్యాహ్న భోజన కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కాగా గత కొంతకాలంగా బిల్లులు రావడం లేదు. బియ్యం మినహా తొమ్మిది రకాల వస్తువులు తామే పెడుతున్నామని బిల్లులు రావడం లేదని వాపోయాడు. కూరగాయలు కోసే కత్తితో హల్‌చల్ చేశాడు. తమకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశాడు. తాము పేదవారమని బిల్లులు చెల్లించకుండా ఉంటే ఎలా బతకాలని వాపోయాడు. ప్రధానోపాధ్యాయులు అస్గర్ ఉన్నీసా పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రంగప్రవేశం చేసి తుకారాంను అదుపులోకి తీసుకున్నారు. బిల్లులు వారి అకౌంట్లలోనే పడుతాయని ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు.

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

- కాలిబూడిదైన పెళ్లి సామగ్రి


అగ్నిప్రమాదంలో కాలిబూడిదైన సామగ్రి, ఇల్లు

భైంసారూరల్: మండలంలోని కుంబి గ్రామానికి చెందిన ఉద్గిరి రాందాస్ ఇంట్లో అగ్ని ప్రమాదం సంభవించింది. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి కాలిబూడిదైంది. ఉద్గిరి రాందాస్ తన భార్యతో కలిసి పనికి వెళ్లాడు. సాయంత్రం ఇంట్లో నుంచి పొగలు రావడంతో గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం అందించారు. చుట్టు పక్కల వారు మంటలను ఆర్పే ప్రయత్నం చేసిన ఫలితం కానరాలేదు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఉద్గిరి రాందాస్ కూతురు పెళ్లి నిశ్చయమైంది. దీంతో పెళ్లి కోసం సామగ్రిని తీసుకువచ్చి ఇంట్లో ఉంచారు. అగ్నిప్రమాదంలో ఇంట్లోని సామగ్రి పూర్తిగా కాలిబూడిదైంది. ప్రమాదానికి కారణాలు తెలియరాలేదు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జరిమానా

నిర్మల్‌టౌన్: మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి మూడు రోజుల సాధారణ జైలు, 39 మందికి జరిమానా విధిస్తూ నిర్మల్ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు నిర్మల్ పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు దేవేందర్, రాజశేఖర్ తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. మద్యం మత్తులో వాహనం నడుపుతూ పలువురు పట్టుబడగా వారిని నిర్మల్ కోర్టులో హాజరు పరిచారు. ఇందులో ఇద్దరికి సాధారణ జైలు, 39మందికి రూ.53,300 జరిమానా విధిస్తూ ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి అజీజ్ రెహమాన్ తీర్పునిచ్చారు. అలాగే వారం క్రితం పట్టుబడిన 43 మందిని సైతం కోర్టులో హాజరు పరుచగా రూ.45200 జరిమానా, ఇద్దరికి మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి అజీల్ రెహమాన్ తీర్పునిచ్చినట్లు కోర్టు లైజన్ అధికారి సక్రియ నాయక్ తెలిపారు.

నాగోబాను దర్శించుకున్న ఎస్పీ కుటుంబ సభ్యులు


పూజలు చేస్తున్న ఎస్పీ కుటుంబ సభ్యులు

ఇంద్రవెల్లి: మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సతీమణి అరుణతో పాటు కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. నాగోబా ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. మెస్రం వంశీయులు పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్ పటేల్ ఆధ్వర్యంలో వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సునీల్, మాజీ సర్పంచ్ నాగ్‌నాథ్ పాల్గొన్నారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన బైక్


సంఘటన స్థలంలో క్షతగాత్రుడు రాజు

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామ సమీపంలో బైక్‌పై వెళ్తున్న రాజు ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల వివరాల ప్రకారం.. రాజు ఇచ్చోడ నుంచి పొచ్చెర గ్రామానికి బంధువుల ఇంటికి వస్తున్నాడు. గ్రామ సమీపంలో నిలిపి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన రాజును స్థానికులు బోథ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

తల్లిని హతమార్చిన కొడుకుకు జీవిత ఖైదు

కాగజ్‌నగర్‌టౌన్: తల్లిని హతమార్చిన కొడుకుకు జీవిత ఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ ప్రిన్సిపల్ జిల్లా, సెషన్ జడ్జి డీ రవీంద్రశర్మ తీర్పు చెప్పారు. లైజన్ ఆఫీసర్ సిరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. 2019 నవంబర్ 21న తాడూరి ప్రశాంత్ తనకు పెండ్లి చేయడం లేదని తల్లి సంధ్యారాణి (52)పై కత్తితో దాడికి పాల్పడ్డాడు. సంధ్యారాణికి కడుపు, మెడపై తీవ్ర గాయాలు కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వారం తర్వాత మృతి చెందింది. అప్పటి సీఐ కిరణ్‌కుమార్ కేసు నమోదు చేశారు. పీపీ జీవీఎస్ ప్రసాద్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టి నేరం రుజువు చేయగా ఈ మేరకు జడ్జి పైతీర్పు ఇచ్చినట్లు వివరించారు.

వృద్ధుడి ఆత్మహత్య

బెజ్జూర్: పురుగుల మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని నాగుల్వాయి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం .. నాగుల్వాయి గ్రామానికి చెందిన మోర్లె బిజ్జు మేర (74) జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి పురుగులు మందు తాగాడు. గమనించిన స్థానికులు చికిత్స కోసం అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డుకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి నారాయణ ఇంటిలో చోరీ జరిగినట్లు స్థానిక సెకండ్ ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ప్రసాద్ తన కుటుంబసభ్యులతో కలిసి రెండురోజుల క్రితం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లాడు. మంగళవారం మధ్యాహ్నం దొంగలు తాళం పగులగొట్టి ఇంటిలోకి చొరబడ్డారు. బీరువాలోని రూ.10వేల నగదు, నగలు ఎత్తుకెళ్లారు.

మనుబోతుకు గాయాలు


చికిత్సకు తరలిస్తున్న బేస్ క్యాంపు సిబ్బంది

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ వద్ద ఓ మనుబోతు పిల్ల తీవ్రంగా గాయపడింది. ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం... మచ్చాపూర్ శివారు ప్రాంతం నుంచి బెదిరిపోయి వచ్చిన ఈ మనుబోతు మండల కేంద్రంలోని జవహర్‌నగర్ వద్ద కంచెను దాటి వచ్చింది. ఈ క్రమంలో హైవే రేయిలింగ్‌తో పాటు కంచె తగలడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన కామధేను గోశాల వ్యవస్థాపకుడు ఆర్యన్ మహారాజ్, స్థానిక జెడ్పీటీసీ పతంగే బ్రహ్మనంద్, స్థానికులు పట్టుకుని పశువైద్యులను పిలిపించి చికిత్స అందించారు. అనంతరం అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. భరంపూర్ బేస్ క్యాంపునకు చెందిన సిబ్బంది జీవన్, జ్ఞానేశ్వర్, రాజేష్‌లు అక్కడికి చేరుకుని చికిత్స నిమిత్తం ఇచ్చోడకు తరలించారు.

జాతీయస్థాయి పోటీల్లో బాల కేంద్రం చిన్నారులు


ప్రశంసా పత్రాలు అందుకుంటున్న బాల కేంద్రం చిన్నారులు

ఆదిలాబాద్: మహారాష్ట్రలోని వార్ధాలో నిర్మల మల్టీపర్పస్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జనవరి 29, 30 తేదీల్లో నిర్వహించిన ఆల్ ఇండియా ఫస్ట్ నేషనల్ డ్యాన్స్ కాంటెస్ట్‌లో ఆదిలాబాద్ బాలకేంద్రం చిన్నారులు పాల్గొన్నారు. 11 మంది చిన్నారులు కూచిపూడి నృత్య విభాగంలో ప్రదర్శన ఇచ్చారు. ఈ జాతీయ స్థాయి పోటీల్లో తమిళనాడు, పాండిచ్చేరి, కేరళ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి కళాకారులు పాల్గొని నృత్యాలు చేశారు. మైనర్ విభాగంలో కొంకటి దీక్ష, ఠాగూర్ హర్షిని, సబ్ జూనియర్ విభాగంలో గుండేటి అశ్విత, గడ్డం శ్రీనిధి, దువాస హర్షిని, చిరాపురం స్వరాత్మిక, సన్నిధి దేశ్ ముఖ్, జాబు శ్రీ వర్ధిని, జూనియర్ విభాగంలో పన్నాల లాస్య, సమ మహతి, చిలుక ఆమనిలు ప్రాతినిధ్యం వహించినట్లు బాల కేంద్రం పర్యవేక్షకుడు మిట్టు రవి తెలియజేశారు.

జాతరను విజయవంతం చేసిన అధికారులు

- నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం


మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ తుకారాం

ఇంద్రవెల్లి: తెలంగాణ రాష్ట్రంలో అతిపెద్ద గిరిజన 2వ జాతర రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన నాగోబా జాతరను విజయవంతం చేసిన అధికారులకు, ప్రజలకు ఆలయ కమిటీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారాం తెలిపారు. నాగోబా ఆలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 21 నుంచి 28 వరకు కొనసాగిన నాగోబా జాతరలో భక్తులకు ఎలాంటి సమస్యలు రాకుండా అన్నీ ఏర్పాట్లు చేసి జాతర విజయవంతం కావడానికి సహకరించిన కలెక్టర్, ఎస్పీ, ఐటీడీఏ పీవోలతో పాటు అధికారులు, పోలీసు శాఖకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా జాతరకు వచ్చిన వ్యాపారస్తులు, వివిధ రాష్ట్రాలతో పాటు ఆయా ప్రాంతాల నుంచి భక్తులు, మీడియా మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో నాగోబా ఆలయ పూజారి మెస్రం శేక్ పాల్గొన్నారు.

పాఠశాలలో ట్రెయినీ కలెక్టర్ విచారణ


విచారణ చేపడుతున్న ట్రెయినీ కలెక్టర్ శ్రీజ

బోథ్: మండల కేంద్రంలో మండల పరిషత్ బాలికల పాఠశాలలో ట్రెయినీ కలెక్టర్ శ్రీజ మంగళవారం విచారణ చేపట్టారు. పాఠశాలలో సల్ల రవి అనే వ్యక్తి పాఠశాలలో అభివృద్ధి పనులు చేశారు. ఈ పనులకు సంబంధించిన బిల్లు రావడం లేదని ఇటీవల కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు ఫిర్యాదు చేశాడు. సంబంధిత ఇంజినీర్ ఎంబీ రికార్డు చేసినా బిల్లులు చెల్లించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో కలెక్టర్ సిక్తా పట్నాయక్ ట్రెయినీ కలెక్టర్ శ్రీజను విచారణ కోసం పాఠశాలకు పంపించారు. సర్పంచ్ సురేందర్‌తో పాటు ఎంఈవో భూమారెడ్డి, ప్రధానోపాధ్యాయులు అస్గర్ ఉన్నీసా బేగంలను విచారించారు. రూ.4లక్షల పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే కాంట్రాక్టర్ రవికి అందించారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు అందడం లేదని తుకారం అనే వ్యక్తి కత్తితో హల్‌చల్ చేసిన ఉదంతంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కడెం: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కల్లెడ గ్రామంలో మంగళవారం వెలుగుచూసింది. గంట లచ్చన్న (52) భార్య శాంత మూడు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి లచ్చన్న మానసికంగా కుంగిపోయాడు. సోమవారం గ్రామ సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొసన రాజు తెలిపారు.


వివరాలు సేకరిస్తున్న ఎస్సై రాజు